బడి బయటే బాల్యం..!

- హోటళ్లు, పంక్చర్ షాపులు, బేకరీలో మగ్గుతున్న వైనం
- విద్యాశాఖ, కార్మిక శాఖాధికారుల నిర్లక్ష్యమా..?

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

బడిబయట బాల్యం మగ్గుతోంది. పలక, బలపం పట్టాల్సిన చిట్టి చేతులు పనికి పోవాల్సి వస్తోంది. అక్షరాలు దిద్దాల్సిన చిన్నారులు చదువులకు దూరంగా ఉంటున్నారు. అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి... అన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరని పరిస్థితులు నెలకొన్నాయి.

ఆదోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు 259, ప్రయివేట్ పాఠశాలలు 125 ఉన్నాయి. ఇప్పటికీ బడిబయట, బడికి దూరంగా విద్యార్థులు ఉన్నారు. ఇందుకు విద్యాశాఖ లేక, కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యమా అని మేధావులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికీ పట్టణంలోని కొన్ని హోటళ్లు, పంక్చర్ షాపుల్లో, బేకరీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బాల కార్మికులు, మనస్పర్థల వల్ల విడిపోయిన తల్లిదండ్రుల పిల్లలు, యాచకులు, ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలు, వలస వెళ్లిన కార్మికుల పిల్లలు, అనాథ పిల్లలు, నివాస ప్రాంత సమీపంలో పాఠశాల లేకపోవడం వల్ల చదవని వారు, వయస్సు ఎక్కువగా ఉన్న వారు, వికలాంగ పిల్లలు బడి బయట ఉన్నారు. గతంలో 'బడి పిలుస్తోంది' అనే పేరు ఉండేది. కొత్త కార్యక్రమం ద్వారా సమగ్ర శిక్ష అధికారులు ఈ పిల్లలను బడిలో చేరుస్తారా..? లేక ఎప్పటిలాగే ప్రచారానికే పరిమితమవుతారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యతను సమగ్ర శిక్ష అధికారులు విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

2009లో అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యనందించాల్సి ఉంది. ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎస్ఎస్ఎ విఫలమవుతోంది. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి, వీధిబాలలు, వలస కూలీల పిల్లలను చేరదీసి వారితో అక్షరాలు దిద్దించాలి. ఈ క్రమంలో బడికి దూరంగా ఉన్న పిల్లలను గుర్తించాలి. అధికారులు మాత్రం సర్వేలు జరిపి, నివేదికలతో సరిపెడుతున్నారు. వేల మంది పిల్లలు బడిబయటే బాల్యాన్ని గడపాల్సి వస్తోంది. వివిధ కర్మాగారాలు, దుకాణాలు ఇలా ఎక్కడ పడితే అక్కడ బాల కార్మికులుగా పని చేస్తున్నారు. గతంలో

హోటల్‌లో పనిచేస్తున్న ఓ బాల కార్మికుడు

చదువుతూ బడి మానేసిన పిల్లలను అధికారులు గుర్తించారు. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సున్న వారు 89 మంది, 15 నుంచి 19 మధ్య 1,643 మంది ఉన్నట్లు కనుగొన్నారు. వీరు కాకుండా వేలమంది చిన్నారులు బడి మానేసి పనులకు వెళ్తున్నారు. వీరందరినీ గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి బడికి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఐసిడిఎస్, చైల్డ్‌లైన్, కార్మిక శాఖ, సమగ్ర శిక్ష అధికారులు సమన్వయం చేసుకుని బడి బయట ఉన్న పిల్లలను చదివించాల్సిన అవసరం ఉంది.

ప్రచారానికే పరిమితమా..?

ప్రభుత్వం చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమం ఎప్పటిలాగే ప్రచారానికే పరిమితమైతే ఆశించిన ఫలితాలు రావనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతేడాది ఈ కార్యక్రమాన్ని అధికారులు బడులు తెరవక ముందే నిర్వహించేవారు. ఈఏడాది ఎండలు, ఎన్నికలు అంటూ నిర్లక్ష్యం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభ సమయంలో 6 నుంచి 14 మధ్య వయస్సున్న పిల్లలను పాఠశాలలో చేర్పించడం, వారికి స్టూడెంట్ కిట్లు అందజేయడం, విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. చదువు వల్ల కలిగే లాభాలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ డ్రైవ్ కోసం మండల, గ్రామ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. మండలాల్లో బడి మానేసిన పిల్లలు ఉన్నారు. అసలు బడిలోనే చేరని పిల్లలు కూడా అన్ని ప్రాంతాల్లోనూ ఉన్నారు. అధికారులు వీరిని గుర్తించడంలో నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతేడాది చిన్నారులను బడిలో చేర్పిస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ప్రతేడాది బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తే అంతమంది బయట ఎందుకు ఉన్నారన్నదే ఇప్పుడు అందరిలోనూ ఉత్పన్నమవుతున్న ప్రశ్న. తప్పుడు లెక్కలు చూపి, ఉన్నతాధికారులను పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు కూడా వస్తున్నాయి. పిల్లలను చేర్పించే కార్యక్రమాలు తూతూమంత్రంగా సాగుతుండడంతో చాలామంది పిల్లలు బడిబయటే ఉంటున్నారు. మెకానిక్ షెడ్లు, చెత్త ఏరుకునే వారిగా, పశువుల కాపరులుగా, కార్ఖానాలు, హోటళ్లు, ఇటుకబట్టీల వద్ద కార్మికులుగా మారుతున్నారు. మరోవైపు విద్యాశాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పథకాలు, కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడం లేదు. పథకాలను ప్రణాళికబద్ధంగా అమలు చేస్తే విద్యార్థుల డ్రాపవుట్స్ తగ్గుతాయి. పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచడం, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి అంశాల్లో అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఈనెలలో ఐదు రోజులు ప్రత్యేక డ్రైవ్‌లు

- సురేష్ బాబు, అసిస్టెంట్ కమిషనర్, లేబర్, ఆదోని

బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెలలో ఐదు రోజులు ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టాం. ఏ ఒక్క విద్యార్థిని కూడా గుర్తించలేదు.

మీకు సమాచారం ఇవ్వలేం

- ఎంఇఒ-1,రాజేంద్రప్రసాద్

ఫోన్ ద్వారా ప్రతిదీ విలేకరులు అడిగిన సమాచారాన్ని మేము అందించలేం. మాకు పాఠశాలల సందర్శన, మీటింగులు, మా పనులు ఉంటాయి. ప్రతిదీ మీరు సమాచారం అడిగితే మేము ఇవ్వలేమని ఫోన్ ద్వారా తెలిపారు.

జిల్లా అభివృద్ధికి కృషి

- కలెక్టర్ రంజిత్ బాషా - కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఉదయం 10.15 గంటలకు కలెక్టర్ పి.రంజిత్ బాషా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మత పెద్దలు, సర్వమత ప్రార్థనలు నిర్వహించి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. కర్నూలు కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు జిల్లా తనకు సొంత జిల్లాలాగా అని, తన స్వస్థలం నందికొట్కూరు నియోజకవర్గమని తెలిపారు. తన విద్యాభ్యాసం కొంత వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే సాగిందని చెప్పారు. దాదాపు 20 ఏళ్ల క్రితం ఉద్యోగ రీత్యా కర్నూలు జిల్లాను విడిచి వెళ్లామని తెలిపారు. మళ్లీ 20 ఏళ్ల తర్వాత కలెక్టర్‌గా సొంత జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేస్తానని చెప్పారు. జిల్లా ప్రజలందరికీ మేలు చేకూర్చే విధంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరపున తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నూతన కలెక్టర్‌కు జెసి నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డిఆర్ఒ మధుసూదన్ రావు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ధర్నా చేపడుతున్న కెవిపిఎస్ నాయకులు, బాధితులు

నిందితులను అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామంలో దళిత హనుమక్కను కులం పేరుతో దూషించి, విచక్షణ రహితంగా దాడి చేసిన ఆధిపత్య వర్గాలను అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. పది రోజులైనా కేసు నమోదు చేయకుండా సివిల్ పంచాయితీ చేసుకోండి అంటూ భయపెడుతున్న వెల్దుర్తి పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు ధర్నా చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్ మాట్లాడారు. రత్నపల్లె గ్రామంలో మూడు తరాలుగా దళితులు పంట వేసుకుని జీవిస్తూ వచ్చిన భూమిని బలవంతంగా లాక్కోవాలని చూస్తున్న ఆధిపత్య వర్గాలు ఈనెల 17న దళితుల కంది పంటను రాత్రికిరాత్రి నాశనం చేశారని తెలిపారు. ఉదయం ఇత్తుతుంటే తెలిసి వెళ్లి అడ్డుకున్న దళిత మహిళ గురుగింజ హనుమక్కను, ఆమె భర్త పెద్ద రాముడు, కొడుకు రామాంజనేయులును కులం పేరుతో దూషించి దాడి చేశారన్నారు. దాడికి గురైన హనుమక్క కోలుకోలేక కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఆరు రోజులు ఉన్నా కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. కేసు నమోదు చేయమంటే 'వాళ్లకు పట్టా ఉంది. మీ ఆధారం ఏముంది' అంటూ పోలీసులు పంచాయితీ చేస్తున్నారని తెలిపారు. పట్టా ఉంటే కులం పేరుతో తిట్టి కొట్టొచ్చా అని వారు ప్రశ్నించారు. మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న వంక పోరంబోకుకు అనుభవం తప్ప పట్టా ఇవ్వరని తెలియని పోలీసులు, ఘటనను విచారణ చేయకుండానే 'గట్టిగా మాట్లాడితే మీరే దాడి చేసినట్లు కేసు పెడతామ'ని భయపెడుతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి దళితులపై దాడి చేసిన బోయిని ఆనంద్, నరేంద్ర, రామలింగం, భూపాల్, లోకేష్, సోమేశ్, శేఖర్, పెద్ద అయ్యమ్మపై కేసు నమోదు చేయించి అరెస్టు చేయాలని కోరారు. సమస్య పట్ల స్పందించకపోతే జిల్లావ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని, చలో రత్నపల్లె కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. జెసి నారపురెడ్డి మౌర్యకు ఫిర్యాదు చేశారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు మదనగోపాల్, చక్రపాణి, సుధాకర్, ఆంజనేయులు, రత్నం, బీదన్న, బాధితులు పెద్ద రాముడు, రామాంజినేయులు, నాగరాజు, శ్రీరాములు, చిన్న రాముడు, రాంపుల్లయ్య, మారెన్న, అనిల్, నాగమ్మ, మాధవి, గోవిందమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- ఆస్పత్రిలో విద్యుత్ కోత లేకుండా చూడాలి
- మంత్రి టిజి.భరత్
- విద్యుత్ శాఖాధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టిజి.భరత్ మాట్లాడారు. నగరంలో విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రధానంగా ఓల్డ్ సిటీలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలను సరిజేయాలని, విద్యుదాఘాతం జరగకుండా చూడాలని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మెయింటనెన్స్ సరిగ్గా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రిలో విద్యుత్ కోతలు ఉండడం వల్ల రోగుల ప్రాణాలకే ప్రమాదం తలెత్తుతుందన్నారు. ఆస్పత్రిలో విద్యుత్ నిర్వహణ సరిగ్గా లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఆస్పత్రి అధికారులతో చర్చించి వెంటనే ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్స్ వర్క్స్ వద్ద 33 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు 10 సెంట్ల స్థలం అవసరం అవుతుందని, ఇందుకోసం మున్సిపల్ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. అవసరమైతే విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడి ఏర్పాటు చేసేందుకు ముందుకెళ్తామని చెప్పారు. ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి, అధికారులు పాల్గొన్నారు.

పాతబస్తీలో ట్రాఫిక్ కష్టాలు తీరుస్తాం

నగరంలోని పాతబస్తీలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో అత్యంత రద్దీ ప్రాంతమైన ఓల్డ్ సిటీలో ప్రజలు ప్రయాణాలు సాగించడం కష్టంగా ఉంటుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చౌక్ బజార్ నుంచి జమ్మిచెట్టు వరకు వెళ్లే దారితో పాటు వన్‌టౌన్ పోలీసు స్టేషన్, రాంబొట్ల దేవాలయం వెళ్లే దారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ దారిలో రోడ్డు విస్తరణ చేసేందుకు టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఇల్లు, దుకాణదారులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరస్పరం చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అంగీకారం లేకుండా దౌర్జన్యంగా కూల్చివేసే పరిస్థితి తమ ప్రభుత్వంలో ఉండదని చెప్పారు. షరాఫ్ బజార్, బిర్లా గేట్ వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించే ముందు వారికి ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. ఏ ఒక్కరూ రోడ్డున పడకుండా వారు వ్యాపారాలు చేసుకునేందుకు తగిన విధంగా స్థలం చూపించి నగరంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఇంకెవరూ ఆక్రమణలు చేపట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్నింటిపై పరిశీలించి ప్రణాళిక తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి

'కెవి.సుబ్బారెడ్డి'లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

డాక్టర్ కెవిఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. నగర శివారులోని దూపాడులో ఉన్న డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా లయన్ డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి హాజరయి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, 90 శాతం హాజరు కలిగి ఉండాలని తెలిపారు. కష్టపడి చదవాలని, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్.విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ...కష్టపడితే కానీ లక్ష్యం చేరుకోలేమని, ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జె.కన్నా కుమార్, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

పివి గొప్ప రాజనీతిజ్ఞుడు : డిసిసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పివి.నరసింహ రావు గొప్ప రాజనీతిజ్ఞుడని డిసిసి అధ్యక్షులు కె.బాబురావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి పివి.నరసింహ రావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బాబురావుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పివి.నరసింహ రావు రాజకీయాల్లో కొత్త వరవడి సృష్టించారని తెలిపారు. ఆయన దేశానికి చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డిసిసి గౌరవాధ్యక్షులు ఉండవెల్లి వెంకటన్న, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ అనంతరత్నం, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ ఈ.లాజరస్ పాల్గొన్నారు.

'గ్రీన్ కో'పై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాణ్యం, ఓర్వకల్లు మండలాల మధ్య పేద రైతుల భూములతో పాటు 100 ఎకరాల ఫారెస్ట్ భూమిని ఆక్రమించి ప్రాజెక్టును నిర్మించిన గ్రీన్‌కో కంపెనీపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. వేల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ప్రాజెక్టు కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు సరైన పరిహారం కూడా ఇవ్వలేదని తెలిపారు. రైతులు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసే భూములను స్వాధీనం చేసుకున్నారని అన్నారు. ఒక్క పైసా నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ భూములన్న పేరుతో కాజేశారని తెలిపారు. 100 ఎకరాల ఫారెస్ట్ భూములను కాజేశారని వార్తలొస్తున్న నేపథ్యంలో గ్రీన్ కో కంపెనీపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా కోసం రైతుల భూముల్లో దౌర్జన్యంగా టవర్స్ వేశారని తెలిపారు.

సుందరయ్య పార్కు కబ్జా

- కార్పొరేటర్ అనుచరుడు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పాణ్యం నియోజకవర్గం సోమిశెట్టి ఎస్టేట్‌లో స్వాతంత్ర్య సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య పార్కును ఒక కార్పొరేటర్ అనుచరుడు, కాంట్రాక్టర్ కబ్జా చేశారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. పార్కులో మట్టి రాళ్లు, కంకర, ఇసుక వేసి డంపు యార్డుగా మార్చుకున్నారని చెప్పారు. శుక్రవారం శిథిలమైన పార్కులో స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం, పర్యావరణ పరిరక్షణ కమిటీ, వార్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు మొక్కలు నాటారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు టి.హరికృష్ణ, వార్డు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎన్.అలివేలు, జయలక్ష్మి మాట్లాడారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు భయపడి శిథిలమైన సుందరయ్య పార్కును అభివృద్ధి చేయకుండా అధికారులు వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం మారినా అధికారుల్లో మార్పు రాలేదని విమర్శలు వస్తున్నా స్పందించడం లేదన్నారు. స్థానికులు నగరపాలక సంస్థకు ఇచ్చిన రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని అధికారులు కాంట్రాక్టర్‌కు అప్పజెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రోడ్డు పక్కన రోడ్డు, రోడ్డుపైన రోడ్డు వేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్న మున్సిపల్ అధికారులు సుందరయ్య పార్కును ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, కొత్తగా ఎన్నికైన పాలకులు స్పందించి సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. పిపిఎస్ఎస్ నాయకులు సివి.వర్మ, ఎన్.పీటర్, ప్రభాకర్ రెడ్డి, బి.శేఖర్, వార్డు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కెఎస్.పద్మ, శివాని, కోటేశ్వరరావు, సరిత, మద్దిలేటి, రమణి, రాజు, మధు, రాజశేఖర్ పాల్గొన్నారు.

స్థానికులతో కలిసి మొక్కలు నాటుతున్న సంఘం సభ్యులు

4న సంపూర్ణ అభియాన్ ప్రోగ్రాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - మద్దికెర

జులై 4న సంపూర్ణ అభియాన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధికారులు, ఎబిఎఫ్, అధికారి అఖిల, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీతి అయోగ్‌లో భాగంగా మండలంలో ఉన్న 10 ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేసినట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యాశాఖ, అగ్రికల్చర్, హౌసింగ్, ఉపాధి హామీ, ఐకెపి, విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, వెటర్నరీ, ఐసిడిఎస్ వంటి పది శాఖలు ఉంటాయన్నారు. అధికారులు రంగస్వామి, మధుబాబు, ఉమాకాంత్, రవి, రాగిణి, కృష్ణా నాయక్, మద్దిలేటి స్వామి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మౌర్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

కెడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జెసి నారపురెడ్డి మౌర్య శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఇన్‌ఛార్జీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధి కారి ఎం.విజయ్ కుమార్, జనరల్ మేనేజర్లు పి.రామాంజనేయులు, కె.శివలీల, జిల్లా సహకార శాఖాధికారి ఎన్.రామాంజనేయులు మౌర్యకు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు అధికారులు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక స్థితిగతులను, 2024-25 సంవత్సరంలో బ్యాంకు చేపట్టే వ్యాపార లావాదేవీలకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకును అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని నారపరెడ్డి మౌర్య బ్యాంకు అధికారులను ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెకర్‌గా పి.రంజిత్ బాషా బాధ్యతలను చేపట్టిన అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఎపి జెఎసి ఛైర్మన్ సిహెచ్.వెంగల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వి జవహర్ లాల్, నగర అధ్యక్షులు ఎంసీ కాశన్న, నగర కార్యదర్శి ఎం రామకృష్ణ, రాష్ట్ర టైపిస్ట్ స్టెనోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్ ఈశ్వరయ్య, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్, వెటర్నరీ లైవ్ స్టాక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరి కుమార్ రెడ్డి, వెంకటరాజు, రామాంజనేయులు, వేణుగోపాల్ వెంకటేశ్వర్ రెడ్డి కలిసి అభినందనలు తెలియజేశారు. రాయలసీమ విద్యార్థి సంఘం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు కలెక్టర్‌ను కలిశారు.

పిజి సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పత్తికొండ

ఈ ఏడాది పీజీ సెట్ పరీక్షల్లో పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జే.నందిని రాష్ట్రస్థాయిలో ఫిజిక్స్ విభాగంలో 4వ ర్యాంకు, డీకే.రాజేశ్వరి 47వ ర్యాంకు, కే.మౌనిక 94వ ర్యాంకు, పి.హసన్ బి 103వ ర్యాంకు, శ్రీలత 425 ర్యాంక్, కుసుమ 426వ ర్యాంకులు సాధించారని తెలిపారు. కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు పేరు తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రస్థాయి పరీక్షలో ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించేందుకు విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన ఫిజిక్స్ విభాగ ఇన్చార్జి సాయి శశిధర్‌ని కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపక బృందం అభినందించారు. పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని వసతులతో కూడిన తరగతి గదులు ఉన్నాయని, కళాశాలలో చేరే విద్యార్థులకు మంచి విద్యను బోధించేందుకు సీనియర్ అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. 2024 - 25 సంవత్సరంలో కళాశాలలో చేరేందుకు పత్తికొండ పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యువేసి కోఆర్డినేటర్ డాక్టర్ ఉస్మాన్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్ కుమార్, ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ కే.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్వాతంత్ర్య పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి.అనిత, సీనియర్ జర్నలిస్టు పల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపవలసిన అవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవరుపై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.



కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

మాట్లాడుతున్న బుట్టా రేణుక

ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటాం

- మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపి ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉంటామని మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఉన్న వైసిపి కార్యాలయంలో వైసిపి గోనెగండ్ల మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బుట్టా రేణుక మాట్లాడారు. గెలుపోటములు సర్వ సహజమని, ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. అందరికీ అండగా ఉంటానని, వైసిపికి రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం ఓట్లతో ప్రజలు అండగా ఉన్నారని చెప్పారు. కానీ 11 సీట్లు రావడం ప్రజల్లో అదేదో తెలియని అపోహలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ... కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నాయకులు బుట్టా నీలకంఠ, బుట్టా ప్రతుల్, వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసి రెడ్డి, గోనెగండ్ల మండల నాయకులు నగేష్ నాయుడు, బందే నవాజ్, కాశీ విశ్వనాథ్ రెడ్డి, తిరుమల రెడ్డి, కృష్ణారెడ్డి, మన్సూర్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

లాభాల బాటలో అవ్వ బ్యాంకు

- శ్రీమహా యోగి లక్ష్మమ్మవ్వ బ్యాంకు ఫౌండర్ ఛైర్మన్ రాచోటి రామయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు సిబ్బంది

ప్రజాశక్తి - ఆదోని రూరల్

బ్యాంకు శ్రేయోభిలాషుల సహకారంతో శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ కోఆపరేటివ్ బ్యాంకు లాభాల బాటలో నడుస్తోందని బ్యాంకు ఫౌండర్ ఛైర్మన్ రాచోటి రామయ్య, ఛైర్మన్ రాచోటి సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆదోని పట్టణంలో బ్యాంకు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఏడాది బ్యాంకు నికర లాభం రూ.2.03 కోట్లు వచ్చిందని తెలిపారు. బ్యాంకు డివిడెండ్ 8.5 శాతం ఇస్తున్నట్లు చెప్పారు. బ్యాంకులో ఇప్పటి వరకు రూ.266 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. బ్యాంకు ద్వారా రూ.173 కోట్లు వివిధ రకాల రుణాలు అందించామని అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. బ్యాంకు బోర్డు ఆఫ్ మేనేజింగ్ డైరెక్టరు లక్ష్మన్న శెట్టి, హుస్సేన్ అహ్మద్, ఆంజనేయులు, ఆర్‌విఎం.రెడ్డి, గుప్త, బ్యాంకు సిఇఒ మురళీ పాల్గొన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు

ప్రజాశక్తి - హాలహర్వి

పనులు చేస్తున్న సిబ్బంది

సాగిబండ పంచాయతీ గ్రామస్తులు వీరాపురం వెళ్లాలంటే కష్టాలు తప్పడం లేదు. ఈ రెండు గ్రామాల మధ్య దూరం రెండున్నర కిలో మీటర్లు ఉంటుంది. ఈ గ్రామానికి సుమారు దశాబ్ద కాలం క్రితం గ్రావెల్ రోడ్డు నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు కనీసం మరమ్మతులు చేసిన దాఖలాలు కూడా లేవు. రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. సుమారు 1000 మందికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామం నుంచి నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో సైతం కాలినడకనే వెళ్లాల్సిన పరిస్థితి. ఈ సమస్యను గ్రామస్తులు పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితం సర్పంచిగా బాధ్యతలు స్వీకరించిన జయశ్రీ ఈ రహదారి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. వారి నుంచి స్పందన లేకపోవడం, పంచాయతీలో నిధులు లేకపోవడంతో సొంత ఖర్చులతో రహదారికి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు చేసి రెండున్నర కిలో మీటర్ల రహదారిలో గుంతలు పూడ్చి చదును చేయించారు. సర్పంచిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి

- ఎమ్మెల్యే బీవీకి అభినందనలు - మున్సిపల్ చైర్మన్ రఘు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ అభివృద్ధికి సహకారంతో ముందు పోదామని టిడిపి, వైసిపి కౌన్సిలర్లు కోరారు. శుక్రవారం కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ రఘు అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్, అధికారులు, డిఇఇలు, ఎఇఇలు విధులు నిర్వహించి, చక్కగా సహకారం అందించడం వల్ల వైసిపి పాలనలో కౌన్సిల్ హయాంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నేతృత్వంలో పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లామని మున్సిపల్ ఛైర్మన్ రఘు పేర్కొన్నారు. ముందుగా మున్సిపల్ సిబ్బంది అంశాలపై అజెండా తీర్మానాన్ని, కౌన్సిల్ ఆమోదాన్ని కోరారు. వెంటనే మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, కౌన్సిలర్లు 26 అంశాలపై తీర్మానాలు ఆమోదించారు. అనంతరం బజారి, శివప్రసాద్, నాగశేష్ప, డిస్ కేశరెడ్డి, వైసిపి కౌన్సిలర్లు వార్డు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ముందుగా టిడిపి కౌన్సిలర్ దయాకర్ మాట్లాడుతూ... ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం ఒకరికొకరి అభినందనలు తెలుపుకున్నారు. టిడిపి కౌన్సిలర్లు ముందుగా మున్సిపల్ ఛైర్మన్ రఘుకు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్‌కు, కౌన్సిలర్లకు ఒకరికొకరు సీట్లు తినిపించుకొని ఆలింగనం చేసుకున్నారు. అలాగే కమిషన్ గంగిరెడ్డికి, డిఇఇలకు, ఎఇఇలకు సీట్లు పంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ మాట్లాడారు. అభివృద్ధి పనులు ఏవైనా ఉంటే తాము సహకరిస్తామని, తమకూ సహకరిస్తే అన్ని పనులూ సజావుగా సాగుతాయని తెలిపారు. అభివృద్ధి పనులకు వినియోగించుకోవడానికి డిఇఇలు, ఎఇఇలు సహకరించారని చెప్పారు. వర్షాకాలంలో పారిశుధ్య పనుల్లో భాగంగా డ్రెయినేజీ, మురుగు కాలువలు శుభ్ర చేయడం, శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని తెలిపారు. విష జ్వరాలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సజావుగా సాగింది. డిఇఇలు మనోహర్ రెడ్డి, నీరంజ, విక్టర్, ఎఇలు శరత్, మదన్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ డాక్టర్ రఘు

తీర్మానాలు ఆమోదిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్

క్రమశిక్షణతో సాధించలేనిది ఏదీ లేదు

- ట్రెయినీ ఐఆర్‌ఎస్ సమీర్ రాజా

ప్రజాశక్తి ఆదోని

సమీరా రాజాను సన్మానించిన సిబ్బంది

మనిషికి క్రమ శిక్షణ, పట్టుదల, ఏకాగ్రత ఉంటే సాధించలేనిది ఏమీ లేదీ లేదని ట్రెయినీ ఐఆర్‌ఎస్ సి.సమీర్ రాజా తెలిపారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గ్రూపు సర్వీస్ పరీక్షలపై వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ మురళీ మోహన్ అధ్యక్షతన సమీర్ రాజాను సన్మానించారు. ఈ సందర్భంగా సమీర్ రాజు మాట్లాడారు. విద్యార్థి దశలోనే భవిష్యత్తుపై ఒక ప్రణాళిక ప్రకారం చదివి కలలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు అయ్యప్ప, బాలస్వామి, ఇందిరా, హనుమంతప్ప, యుగంధర్ రెడ్డి, రంగనాథం, నళిని, మధు, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

1న ఇంటి వద్దకే పింఛన్లు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను జులై 1న పింఛనుదారుల ఇంటి వద్దనే సచివాలయ కార్యదర్శులు పంపిణీ చేస్తారని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచే పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆయా సచివాలయ పరిధిలో ప్రతి 50 మంది పింఛనుదారులకు సంబంధించి ఒక కార్యదర్శికి పంపిణీ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. నగరంలో రూ.23,20,41,500 కోట్లతో 33,751 మందికి 26 రకాల పింఛన్లు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

పెద్దలు పనికి.. పిల్లలు బడికి

- ఎంఇఒలు రామాంజనేయులు, రఘునాథ్

ప్రజాశక్తి - నందవరం

నందవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దలు పనికి వెళ్లాలని, పిల్లలు బడికి వెళ్లాలని ఎంఇఒలు రామాంజనేయులు, రఘునాథ్ తెలిపారు. శుక్రవారం నందవరం స్పెషల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. నందవరం గ్రామ ప్రధాన పురవీధుల గుండా పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువు విజ్ఞానాన్ని, తెలివి తేటలను, సమాజంలో మనిషి మంచిగా జీవించే విధానాన్ని నేర్పుతుందని తెలిపారు. గ్రామంలోని తల్లిదండ్రులు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. స్పెషల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుబ్బన్న, ఉపాధ్యాయులు విజయశాంతి, లక్ష్మీదేవి, గౌతమి, ప్రియదర్శిని, సిఆర్‌పిలు ఉరుకుంద, మహేశ్వరి, ఐఆర్‌టిలు వెంకటసుబ్బయ్య, ప్రశాంత్, శైలజ, షాషు బాష పాల్గొన్నారు. **కోసిగి** మండలం సాతనూరు గ్రామంలో 'బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి' అనే నినాదంతో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఉన్నత స్థాయికి ఎదగాలని అంబేద్కర్ యూత్, మదర్ థెరిసా యూత్ సభ్యులు కోరారు.

కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- ప్రభుత్వ డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాకాలంలో నీరు ఎక్కువ నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం సిహెచ్ఒ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నివారణ గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం చిప్పగిరి కెజిబివి పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య ఆధ్వర్యంలో ప్రభుత్వ డాక్టర్లు బాలికలకు సకిల్ సేల్ అనీమియా, స్టాప్ డయేరియా, మలేరియా నివారణ మాసోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడారు. ప్రజలు నివాసం ఉన్న ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉన్నా, పందులు తిరుగుతున్నా తప్పనిసరిగా ఆ పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని తెలిపారు. డయేరియా కేసు నమోదయితే తక్షణమే వారు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వచ్చి చికిత్స పొందాలని సూచించారు. కలుషిత తాగునీరు తీసుకోకుండా స్వచ్ఛమైన తాగునీరు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చల్లని వాతావరణం ఉన్నప్పుడు తాగునీటినివేడి చేసుకుని తాగటం మంచిదని తెలిపారు. వైద్య సిబ్బంది పద్మావతి, రామ్మోహన్, ఎఎన్ఎంలు శాంతకుమారి, సరస్వతి, ఆశా కార్యకర్తలు, కెజిబివి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాఘవేంద్రుని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దంపతులు, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఎస్పీ హరీష్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వర్ణ పల్లకోత్సవంలో పాల్గొని పల్లకిని మోశారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేషవస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలి

- ఆదోని జిల్లా సమితి అధ్యక్షులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

అత్యంత వెనుక బడిన ప్రాంతం ఆదోని డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, ఎంహెచ్ పిఎస్ ఎ.నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొత్త జిల్లాల ఏర్పాట్లలో అత్యధికంగా నష్టపోయింది ఆదోని ప్రాంతమేనని తెలిపారు. వలసల్లో బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలను దాటి, కరువు, నిరుద్యోగం, అభివృద్ధి లేమితో ఆదోని ప్రాంతం ఎడారిగా మారే అవకాశముందన్నారు. ఆదోని డివిజన్‌ను జిల్లాగా ప్రకటించి అభివృద్ధి చేయాలని కోరారు. 2020 నుంచి ఆదోని జిల్లా సమితి తరఫున ఆదోని జిల్లా ఏర్పాటు కోసం పోరాడుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు అఖండ మెజారిటీతో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఆదోని ప్రజల కలలను సాకారం చేస్తుందనే నమ్మకంతో ప్రజలున్నారన్నారు. ఈ విషయంలో ముఖ్య నేతలను కలుస్తామన్నారు.

వేలం పాటలో తగ్గిన ఆదాయం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మేజర్ పంచాయతీలో సర్పంచి పాల్ దినకరన్ అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా పంచాయతీకి ఆదాయం తగ్గింది. వేలం పాటల్లో బండిమెట్టను భీమయ్య అనే పాటదారుడు రూ.2.25 లక్షలకు, దినసరి మార్కెట్‌ను లడ్డు సల్మాన్ అనే పాటదారుడు రూ.12 వేలకు, కమేళాను ఎరిగేరి నబిసా అనే పాటదారుడు రూ.33 వేలకు దక్కించుకున్నారు. ఈ వేలం పాటలు 9 నెలలకే నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి శివప్ప తెలిపారు.

వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

మునెప్ప నగర్‌లో వేగంగా అభివృద్ధి పనులు

- మున్సిపల్ సిబ్బందిని, వార్డు ఇన్‌ఛార్జీలను పరుగులెత్తిస్తున్న బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని మునెప్ప నగర్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి హామీఇచ్చారు. ఇచ్చిన మాటను తప్పకుండా ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసి వారం గడవకముందే వార్డుల్లో మున్సిపల్ సిబ్బందిని, వార్డు ఇన్‌ఛార్జీలతో పనులు ప్రారంభించారు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి. ఆయన ఆదేశాల మేరకు 23వ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా టిడిపి 23వ వార్డు ఇన్‌ఛార్జీ ఎస్.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం మునెప్ప నగర్‌లోని, కారం పొడి మిషన్ రోడ్డులో కొత్త బోర్ వేశారు. అలాగే గత వైసిపి ప్రభుత్వం వార్డుల్లో వాటర్ ట్యాంకులను బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఏర్పాటు చేసిన వాటికి మరమ్మతులు చేయకుండా నిరుపయోగంగా గాలికి వదిలేసింది. మునెప్ప నగర్‌లోని రాముల వారి గుడి దగ్గర ట్యాంకులకు పైపులైన్, కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేసి తిరిగి మరమ్మతులు చేపట్టి వాటిని కూడా వాడుకలోకి తెచ్చారు. గెలిచిన వారంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ఇన్‌ఛార్జీల సమక్షంలో పనులను చేయించిన ఘనత బీవీకే దక్కుతుందని వార్డు ఇన్‌ఛార్జీ మహబూబ్ బాష తెలిపారు. వార్డులో విద్యుత్ స్తంభాలకు ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేసి వీధి దీపాలను వెలిగించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వార్డుల్లో డ్రెయినేజీని ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి సమస్యలను పరిష్కరించడంలో బీవీ దిట్ట అని కాలనీవాసులు కొనియాడుతున్నారు.

బోర్ వేయిస్తున్న వార్డు ఇన్‌ఛార్జీ మహబూబ్ బాషా

లబ్ధిదారులు ఇళ్లలో చేరాలి

- టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

టిడ్కో గృహ సముదాయంలో చేరితే ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి లబ్ధిదారులకు తెలిపారు. శుక్రవారం ఆదోని శివారులోని సిరుగుప్ప రోడ్డులో టిడ్కో గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే పార్థసారథి సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి సుమారు 4,720 గృహాలు నిర్మించినట్లు తెలిపారు. పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులు చేరకపోవడం వల్ల శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందని తెలిపారు. నిరుపయోగంగా ఉండడం వల్ల ఇళ్ల మధ్యనే ముళ్లకంపలు పెరిగి పాములు, విషపురుగులకు ఆవాసంగా మారే అవకాశం ఉందన్నారు. 2000 గృహాల ప్రవేశ ప్రక్రియ పూర్తయి ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించామని అధికారులు చెబుతున్నారన్నారు. 1500 మంది లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన తాళాలు ఇచ్చామని తెలిపారన్నారు. వారందరూ సమూహంగా ఇక్కడ ఇళ్లల్లో చేరితే తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. రాత్రి వేళల్లో దొంగతనాలు, దోపిడీలు జరగకుండా పోలీసులతో మాట్లాడి ఇక్కడ పికెటింగ్ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ముళ్ల కంపల తొలగింపు, పరిసరాలు పరిశుభ్రత వంటి చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. టిడ్కో గృహ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ రాజశేఖర్, డిప్యూటీ ఇంజినీర్ హరికృష్ణ, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, నాయకులు నాగరాజు గౌడ్, సాయి ప్రసాద్ ఉన్నారు.

సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ప్రారంభిస్తున్న మంత్రి బీసీ, ఎమ్మెల్యే గౌరు చరిత

ఎస్‌ఎల్‌విఆర్ బైక్ మోటార్స్, రెడ్డీస్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలో నూతనంగా ఎస్‌ఎల్‌విఆర్ బైక్ మోటార్స్ షోరూం, రెడ్డీస్ రెస్టారెంట్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రులు బీసీ.జనార్దన్ రెడ్డి, టిజి.భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. నంద్యాల చెక్ పోస్ట్ కూడలిలో నూతన షోరూం, పుల్లారెడ్డి కళాశాలలో రెడ్డీస్ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు, టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు.

'నిధులు విడుదల చేయండి'

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

గత రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదలైన ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించడం జరిగిందని ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ వెంటనే జోక్యం చేసుకొని పంచాయతీలకు వెంటనే నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదాయం పెంచాలి

- ఇన్‌ఛార్జీ డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీకి ఆదాయ వనరులను పెంపొందించాలని పత్తికొండ ఇంఛార్జి డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు అన్నారు. శుక్రవారం పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి కొమ్ము దీపిక అధ్యక్షతన గ్రామపంచాయతీ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, జంతు వధశాల వేలంపాటను నిర్వహించారు. ఇంచార్జ్ డిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ దినసరి కూరగాయల మార్కెట్‌ను ఆరోగ్యమ్మ రూ.4,10,000, వారాంతపు సంత చుంచు రాజశేఖర్ రూ.91వేలకు, జంతు వధశాలను జి సోమశేఖర్ రూ.16వేలకు దక్కించుకున్నారని తెలిపారు. బస్టాండ్ వేలంపాటను శనివారం నిర్వహిస్తామని తెలిపారు. నిర్వహించబడునని అన్నారు. ఆసక్తి గల వారు మేజర్ గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డి మునుస్వామి, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరసింహులు, ఇన్చార్జి ఈవో చెన్నయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ నాయుడు

డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం

- నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రతి శుక్రవారం ప్రజలు 'డ్రై డే' పాటిస్తే సీజనల్ వ్యాధులు దూరమవుతాయని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. 'ఫ్రైడే – డ్రై డే' కార్యక్రమంపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, ఆరోగ్య సహాయకులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పాత టైర్లు, బాటిళ్లు, కొబ్బరి బొండాలు, ఎయిర్ కూలర్లు, డబ్బాలు, పులకుండీల వంటి వాటిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారని తెలిపారు. వాటి వల్ల లార్వాలు పెరిగి, దోమలు వృద్ధి చెందుతాయనే విషయాన్ని ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించారన్నారు. అపరిశుభ్రమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, యాంటీ లార్వా, సోడియం హైపో క్లోరైట్ క్రిమిసంహారకాలను స్ప్రే చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

గతంలో నిర్మించిన గృహాలకు బిల్లులివ్వాలి

ప్రజాశక్తి - తుగ్గలి

గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పక్కా గృహాలు నిర్మించుకున్న గిరిజనులకు ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలోని ఎల్లమ్మ గుట్ట తండాలో 12 మంది గిరిజనులకు 2018–19 సంవత్సరంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పక్కా గృహాలు మంజూరు అయ్యాయి. దీంతో గిరిజనులు గృహ నిర్మాణ పనులు చేపట్టారు. అందుకు అప్పట్లో ఒక్కొక్క లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.25వేలు బిల్లులు కూడా చెల్లించింది. అలాగే మరి కొంతమందికి ఒక రూపాయి మాత్రమే బిల్లులు ప్రభుత్వం చెల్లించింది. అయితే వైసిపి ప్రభుత్వం రావడంతో గిరిజనులు నిర్మించుకున్న పక్కా గృహాలకు ఒక్క రూపాయి బిల్లు కూడా గత ఐదు సంవత్సరాలలో రాలేదు. అయితే గిరిజనులు అప్పులు చేసి తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్లలో చేరారు. గత టిడిపి ప్రభుత్వంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తిచేసిన వారందరికీ ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుడు రాజు నాయక్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో తమకు ఒక రూపాయి కూడా ఇంటి నిర్మాణాలకు బిల్లులు మంజూరు కాలేదని, అందువల్ల తెలుగుదేశం ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అర్హత పత్రాలు చూపిస్తున్న గిరిజనులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు వి.రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం ఆదోనిలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ పాఠశాలలో పట్టణ అసోసియేట్ అధ్యక్షులు సి.వీరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, డీఎస్సీలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోస్టులు మంజూరు చేయాలని కోరారు. నిబంధనల మేరకే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, పిఆర్‌సి ప్రకటించేలోగా ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్.భీమరాజు, నాయకులు శ్రీనివాసులు, జంబులయ్య, అబీదా బేగం, అహ్మద్ హుస్సేన్, శ్రీరాములు, జయరాం పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE : KURNOOL
Criminal revision petition No.2/24
Amara Lakshmi Reddy S/o
Baleeswar Reddy. LIC Agent
Sai Baba Nagar, Atmakur.
...Petitioner/Complintent
-Vs-
Vadda Nagaraju
S/o Surya Chandra Raju
Bio Pesticides dealar
C/o thotas Narayanamma
H.No.87-1354-2, Gowthami Nagar,
Near Agrigold Office, Near Good sheperd School, Kurnool. ...Respondent
Notice to Respondent Under Section 397(2) Accured and 399of Cr.P.C Against the order of the Hon'ble judicial First Class Magistrate Atmakur In C.C.No.538/2016 under Section 256(1) of Cr.P.C. Dated 12-12-2023
Where the petitioner/Commplaintent filed the above CRP under the above section to set asaid the dismisal order of the complaintent in CC No.534/2016 Passed by the trail Court date 12-12-2023 and give oppurtunity to the complainent to processed with trail. your the Responent to be appeared before the above court on 02-7-2024 at 10:30 AM and file your objections if any othervise you will be deemed set Experty.
(BY Order of the Court)
SMD HANEEF,
Advocate for Petitioner,
Kurnool

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- గత ఐదేళ్లలో పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు : మంత్రి బిసి

ప్రజాశక్తి బనగానపల్లె

పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, గత ఐదు సంవత్సరాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో పట్టణం మురికి కూపంగా మారిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఈద్గా నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. గ్రామ పంచాయతీ అధికారులు జెసిబిల ద్వారా ఈద్గానగర్‌లోని ఎస్వి చైతన్య హైస్కూల్ పక్కన కాలువలను శుభ్రం చేయడాన్ని మంత్రి పరిశీలించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువలను సరిగా శుభ్రం చేయకపోవడతో దుర్వాసనతో అల్లాడుతున్నామని ప్రజలు మంత్రి దృష్టికి తెచ్చారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి కాలువలను శుభ్రం చేయాలని, లేకపోతే ఇక్కడి నుండి వెళ్లిపొమ్మని గ్రామపంచాయతీ ఈవో హరిప్రసాద్, పంచాయతీ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి బిసి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో తాను పట్టణంలో ఇంటింటికి వెళితే ప్రజలు మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని, దుర్వాసనతో అల్లాడిపోతున్నామని తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన మరుసటి రోజు నుండే అధికారులకు ఆదేశాలు జారీ చేసి మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో పట్టణంలో డ్రెయినేజీ కాలువలను వేయలేదని, ఎక్కడో వైసిపి కార్యకర్తలకు అవసరమైన చోట తప్ప పట్టణంలో కాలువల గురించి పట్టించుకోలేదన్నారు. దీంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని తెలిపారు. పది రోజుల నుండి పట్టణంలో 150 మంది గ్రామపంచాయతీ సిబ్బంది జెసిబిల ద్వారా మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. మరో పది రోజుల్లో పట్టణం అంతా మురికి కాలువలను శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. అధికారులు మొద్దు నిద్ర వీడి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. త్వరలో పట్టణంలో డ్రెయినేజీ ఆధునీకరణ పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో హరి ప్రసాద్, పట్టణ ఉపసర్పంచి బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, వార్డ్ మెంబర్ టిప్ టాప్ కలాం, నాయకులు అల్తాఫ్ హుస్సేన్, సయ్యద్ హుస్సేన్, హమ్మద్ హుస్సేన్, రఫీ, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మురికి కాలువలను పరిశీలిస్తున్న మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

ఎట్టకేలకు బోన్‌లో చిక్కిన చిరుత

- ఊపిరి పీల్చుచుకున్న పచ్చర్ల వాసులు - తిరుపతి జూకు తరలింపు

ప్రజాశక్తి - మహానంది

నల్లమల అడవి ప్రాంతంలోని నంద్యాల జిల్లా మహానంది, శిరివెళ్ల మండలాల పరిధిలోని పచ్చర్ల గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహముస్నీసాను తీవ్రంగా గాయపరిచి చంపిన చిరుత ఎట్టకేలకు శుక్రవారం బోనులో చిక్కింది. మాజీ ఉప సర్పంచి మృతి నేపథ్యంలో నంద్యాల ప్రాజెక్టు టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ బిఎన్ఎన్ మూర్తి, నంద్యాల సబ్ డిఎఫ్ఒ శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘటనాస్థలాలతో పాటు చుట్టుపక్కల మూడు బోన్లు, సిసి కెమెరాలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పచ్చర్ల టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన బోనులో శుక్రవారం తెల్లవారుజామున చిరుతపులి చిక్కింది. అయితే చిరుతను పట్టుకునేందుకు ఫారెస్ట్ అధికారులు తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు బోన్‌లో చిరుత చిక్కడంతో పచ్చర్ల గ్రామ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం చిరుత పులికి ఫారెస్టు అధికారులు మత్తు మందు ఇచ్చి తిరుపతి జూకు తరలించారు. అయితే చిరుత పులిని చూడడానికి స్థానికులతో పాటు ప్రయాణికులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య, డిఆర్ఓ రాజు, అటవీశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మహానంది ఆలయ ఇఒగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు

ప్రజాశక్తి- మహానంది

మహానంది దేవస్థానం నూతన ఈవోగా నల్లకాలువ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేశారు. ఈయన గతంలో కోటప్పకొండ దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ, మహానంది దేవస్థానానికి ఫుల్ అడిషనల్ చార్జిగా నియమించబడ్డారు. ఈ క్రమంలోనే బదిలీ అయిన ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి నుంచి శ్రీనివాస్ రెడ్డి ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాత, కొత్త ఈవోలను ఆలయ సిబ్బంది, మహానందీశ్వర ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వై.మధు, ఓ.వెంకటేశ్వర్లు, నీలకంఠ రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస రెడ్డి

డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రస్తుత సీజన్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు మెరుగైన వైద్యం అందించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం బేతంచెర్లలోని 1, 3వ ఆరోగ్య ఉప కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల రికార్డులను, ఆయా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై డిఎంహెచ్ఒ ఆరా తీశారు. అనంతరం 20వ వార్డు సంజీవ్ నగర్ కాలనీని సందర్శించి అక్కడ డెంగ్యూ కేసులను పరిశీలించారు. కాలనీలోని ప్రజలతో ఆరోగ్య సిబ్బంది ఏవిధంగా వైద్య సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఆరోగ్యాల పట్ల సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య ఉపకేంద్రాల డాక్టర్లు కామేశ్వరరావు, వరప్రసాద్ రెడ్డి, ప్రియాంక, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

పాఠశాలలను ఆధునికంగా నిర్మిస్తాం

- డిఇఒ సుధాకర్ రెడ్డి

- జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన పాఠశాలలను పరిశీలన

ప్రజాశక్తి - పాములపాడు

జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన పాఠశాలలను ఉన్న స్థలంలోనే ఆధునికంగా నిర్మిస్తామని డిఇఒ సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మండ్లెం, కృష్ణారావుపేట, రుద్రవరం గ్రామాలలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కోల్పోయిన పాఠశాలలను డిఇఒ పరిశీలించారు. అనంతరం పాములపాడులో కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న కళాశాల నిర్మాణాలను పరిశీలించారు. విద్యార్థినిల వసతులపై ఆరా తీశారు. పాఠశాల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసి ప్రత్యేక అధికారిని రాజ్యలక్ష్మిని అభినందించారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణరావుపేట గ్రామంలో పాఠశాల జాతీయ రహదారిలో కోల్పోయిందని, అందుకు రూ. 13 లక్షలు స్కూలుకు వచ్చాయన్నారు. రుద్రవరం గ్రామంలో రూ.64 లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, సర్వే డిపార్ట్మెంట్ నివేదికలను తయారు చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్థానికంగా ప్రజాప్రతినిధులతో సమన్వయంతో చర్చించి పాఠశాలలను నిర్మిస్తామన్నారు. పాఠశాల జాతీయ రహదారి పక్కన ఉండడం వలన అటు సైడు గేటు లేకుండా వెనుక సైడ్ నుంచి గేటు పెట్టి ఉన్న స్థలంలోని అంతస్తులు నిర్మించి ఆధునికంగా విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణను పరిశీలిస్తున్న డిఇఒ

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు

- కౌలూరులో కెసి కెనాల్ పూడికతీత పనులు పరిశీలన

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పాణ్యం

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పిస్తున్న పనులు నాణ్యతగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాణ్యం మండలం కౌలూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కెసి కెనాల్‌లో చేపట్టిన పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌలురు గ్రామంలో మేజర్ కెసి కెనాల్‌లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులు నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. గ్రామంలో 71 మంది కూలీలు పూడికతీత పనులలో పాల్గొన్నారని డ్వామా పిడి కలెక్టర్‌కు నివేదించారు. గ్రామంలో 245 జాబ్ కార్డులు ఉండగా 234 మందికి పనులు కల్పించామన్నారు. గత మూడు నెలలుగా కూలీల సరాసరి రేటు 260 రూపాయలు ఉండగా ప్రస్తుత మాసం నందు 280 రూపాయలతో పనులు చేస్తున్నట్లు పిడి వివరించారు. ఎస్సీ కుటుంబాలలో 128 మందికి జాబ్ కార్డులు ఉండగా 106 కుటుంబాలకు పనులు కల్పించామన్నారు. మేజర్ కెనాల్‌లో 3.34 లక్షల నిధులతో ప్రారంభించిన పూడికతీత పనులు జూన్ రెండో వారం నుంచి చేస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చేయాలని కలెక్టర్ సూచించారు. కూలీల సరాసరి రేటు పెరిగేలా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కౌలూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యవేక్షించారు. కేంద్రంలో హాజరయిన విద్యార్థులు, హాజరు పట్టిని, ఇతర రిజిస్టర్లను పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. సంపూర్ణ పోషణ అభియాన్ పథకం కింద గర్భిణులకు పోషక ఆహార కిట్లు, ఫోలిక్ ఆసిడ్ టాబ్లెట్లను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రామచంద్రారెడ్డి, స్త్రీ సంక్షేమ శాఖ పిడి నిర్మల, నంద్యాల సిడిపిఒ, ఎపిడి బాలాజీ నాయక్, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో విజయరాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రబలుతున్న వ్యాధులు

- డాక్టర్ శివశంకరుడు సలహాలు, సూచనలు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

బనగానపల్లె మండలంలో ఒకటి ఏరియా ఆసుపత్రి, రెండు పిహెచ్ సి ఆసుపత్రులు ఉన్నాయి. టంగుటూరు, పలుకూరు పిహెచ్‌సిలు బనగానపల్లె ఏరియా ఆసుపత్రులలో సంవత్సరానికి ఎనిమిది వందల యాభై నుండి 1200 వరకు డయేరియా కేసులు, మలేరియా, పచ్చకామెర్లు, డెంగీ తదితరే వ్యాధులతో దాదాపు రెండు వేల కేసులు వరకు వస్తుంటాయని డాక్టర్స్ తెలుపుతున్నారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, జాగ్రత్తలు తీసుకోకుంటే జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రాణాంతక వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్య నియమాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. టంగుటూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివ శంకరుడు సూచనలు సలహాలు ఆయన మాటల్లో....

మండే ఎండలు ఉక్క పోతతో చికాకు పడే సమయంలో పడే వాన హాయిగానే ఉన్నా వానతో పాటు వచ్చే రోగాలే హైరానా పెడుతుంటాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ప్రారంభమయ్యాయి. పల్లెలలో పారిశుధ్య అంతంత మాత్రంగానే ఉన్న తరుణంలో వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. ఈ తరుణంలో ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పలు వ్యాధులు బారిన పడే అవకాశం ఉంది. గ్రామాలలో అపారిశుధ్యలోపం వ్యాధులకు ఆజ్యం పోస్తుంది. దీంతో దోమల బెడద విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు జ్వరాలతో బాధపడుతున్నారు. కొన్ని ప్రాంతాలలో డయేరియా ప్రబలుతోంది. అప్రమత్తంగా లేకపోతే టైఫాయిడ్, మలేరియా, డయోరియా, డెంగీ, కామెర్లు వంటి వ్యాధులు వ్యాపిస్తాయి.

దోమకాటుతో మలేరియా వ్యాప్తి : ఎనాఫిలిస్ అనే దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాలో రెండు రకాలు ఉంటాయి. ఒకటి వైవాక్స్ మలేరియా కాగా రెండవది ఫాల్సిఫోం మలేరియా , వైవాక్స్ మలేరియా అంత ప్రమాదం కాదు. ఫాల్సిఫోం మలేరియా ప్రాణాంతకమైనది. సరైన చికిత్స తీసుకోకుంటే సెరిబ్రల్ మలేరియాగా మారి రోగి మరణించే ప్రమాదం ఉంది. తీవ్రమైన జ్వరం రోజు విడిచి రోజు జ్వరం రావడం తలనొప్పి ఈ వ్యాధి లక్షణాలు, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

తీసుకోవలసిన జాగ్రత్తలు: ఇంటి పరిసరాల్లో మురుగునీరు చేరకుండా చూసుకోవాలి.రాత్రిళ్ల దోమతెరలు వాడాలి. దోమల నివారణ మందులు వినియోగించాలి. దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న రబ్బర్ టైర్లు తాగేసిన కొబ్బరి బొండాలను దూరంగా పడేయాలి. ఇళ్ల ముందు సైడు కాలువలు ఉంటే దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి.

కలుషిత నీటితో టైఫాయిడ్ : కలుషిత నీరు తాగడం, బహిరంగ మలవిసర్జన ద్వారా వ్యాప్తి చెందే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ వ్యాధి వస్తుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం ఒంటి నొప్పులు తలనొప్పి ఈ వ్యాధి లక్షణాలు కడుపులో అల్సర్లు వల్ల కూడా టైఫాయిడ్ వచ్చే అవకాశం ఉంది.

జాగ్రత్తలు: సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి. కొళాయినీళ్లను కాచి చల్లార్చిన తర్వాతే తాగాలి. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్య నిపుణుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలి. భోజనానికి ముందు చేతులు శుభ్రపరచుకోవాలి.

డాక్టర్ శివ శంకరుడు

ప్రాణాంతకం డెంగీ: క్యూలెక్స్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుంది. సకకాలమును చికిత్స చేయించుకోకుంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. జ్వరంతో పాటు మోకాళ్ళ నొప్పులు ఉంటాయి. రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. ఒక్కొక్కసారి కోమాలోకి వెళ్ళిపోతారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు: ఇంటి ఆవరణ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూల కుండీలు ఫ్రిజ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలి.

ప్రమాదకరం కామెర్లు: కలుషిత నీరు, ఆహారం వల్ల కామెర్లు వ్యాధి వస్తుంది. మద్యం ఎక్కువ తాగిన కామెర్లు వస్తాయి. మూత్రం పసుపు రంగులో రావడం కడుపులో నొప్పిగా ఉండడం. వాంతులు విరేచనాలు కావడంతో పాటు జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు.

చికిత్స పొందుతున్న రోగులు

జాగ్రత్తలు : సురక్షిత నీరు ఆహారం తీసుకోవాలి. మద్యం తాగ కూడదు. స్ట్రీట్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి, నిర్లక్ష్యం చేస్తే ప్రణాళికే ప్రమాదం.

ఇతరుల నుంచి వ్యాపించే డయేరియా: కలుషిత నీరు తాగడం కలుషిత ఆహారం తినడం వల్ల డయేరియా వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపిస్తుంది. రోటా వైరస్ కంపైలో బాక్టర్ క్లోస్టీడియం, డిఫికైల్, ఎస్కిరికియాకోలీ,సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియా కారణంగా డయేరియా ప్రబలుతుంది. విరేచనాలు వాంతులు కావడం. నీరసంగా ఉండడం. ఈ వ్యాధి లక్షణాలు డయేరియా వ్యాధికి ఫ్లూయిడ్స్ ద్వారా చికిత్స అందిస్తారు.

జాగ్రత్తలు: కాచి చల్లార్చిన నీటిని తాగాలి. కలుషిత ఆహారం తినకూడదు, వేడి వేడి ఆహారం తాజా పండ్లను మాత్రమే చూసుకోవాలి. పులుపు కారం ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు. డయేరియా వ్యాధి లక్షణాలు ఉన్నవారు చేపలు ఎక్కువగా తినకూడదు. నూడుల్స్, పానీ పూరి చాట్ వంటి స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండడమే మంచిది.

ఐటిఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో రెండవ విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు కళశాల ప్రిన్సిపాల్ పి.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 29వ తేది నుండి జులై 24వ తేది సాయంత్రం 5 గంటలలోపు ఐటిఐ.ఏపీ.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు జూన్ 29వ తేది నుండి జులై 25వ తేది సాయంత్రం 5 గంటల లోపు నంద్యాల ప్రభుత్వ ఐటిఐ నందు సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. జులై 27న కౌన్సిలింగ్‌నకు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పివి

- ఘనంగా పివి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు దివంగత మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో అపర చాణిక్యుడుగా కీర్తిని ఆర్జించిన దివంగత మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు శుక్రవారం నంద్యాలలోనినంది రైతు సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, డాక్టర్ కిషోర్ కుమార్, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పివి నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ బహు భాష కోవిదుడుగా, రచయితగా భారతీయ భాషల సాహిత్యాభివృద్ధికి పివి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. నంద్యాలలో వ్యవసాయ కళాశాల, బ్రాడ్ గేజ్ రైల్వే, ఉపరితల వంతెన ఏర్పాటు పివి హయాంలోనే జరగడం నంద్యాల ప్రజల అదృష్టమన్నారు. ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ప్రగతి బాటలో నడిపించిన రాజనీతిజ్ఞుడుగా పివి చరిత్రలో నిలిచారని కొనియాడారు. నంద్యాలకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ సృష్టించిన 'నరసింహ' అనే పత్తి వంగడాన్ని పివి చేతుల మీదుగా ఆవిష్కరించడం నంద్యాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని అధ్యాపకులు రఫీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాధవస్వామి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య, హుసేని, ఓబులపతి, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పివి నరసింహారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - మిడుతూరు

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, అప్పుడే గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు వస్తుందని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఉపాధ్యాయులు విద్యనందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను గుర్తుంచుకొని విద్యనభ్యసించినప్పుడే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని అన్నారు. అనంతరం కాతా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు విద్యలో పోటీపడి అభ్యసించినప్పుడే ఫస్ట్ క్లాస్‌లో పాస్ అవుతారని, అప్పుడే పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, మాజీ ఎంపీటీసీ కొండ నారాయణ, హరిసరత్వం రెడ్డి, ప్రమోద్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

30న కోవెలకుంట్లకు మంత్రి బిసి రాక

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి ఈనెల 30వ తేదీన కోయిలకుంట్లకు వస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో నాయకులు గడ్డం రామకృష్ణా రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కలుగొట్ల నాగార్జున రెడ్డి, జొలదరాశి గోవర్ధన్ రెడ్డి, కోయిలకుంట్ల మురళి, కంపమల్ల సుబ్బారెడ్డి, భీమునిపాడు మురళి, వల్లంపాడు జగదీశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, చిన్న కొపెర్ల వెంకటేశ్వర్ రెడ్డి, గుంజలపాడు గోవిందరెడ్డి, ఎలకటూరు ధనుంజయ్ తదితరులు మాట్లాడుతూ బిసి జనార్దన్ రెడ్డి మంత్రి అయిన తర్వాత తొలిసారి కోవెలకుంట్లకు వస్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

2న సంజామలకు మంత్రి రాక

సంజమల : రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జూలై 2న సంజామలకు రానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. టిడిపి మండల నాయకులు పెండేకంటి కిరణ్ కుమార్, మంచాల మద్దిలేటి రెడ్డి, బత్తుల ప్రతాపరెడ్డి, గాదం శెట్టి వెంకటేశ్వర్లు, అక్కంపల్లి రామసుబ్బారెడ్డి, బేలుం సురేష్ రెడ్డి, మూసాని చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బీసీ జార్దన్ రెడ్డి సంజామలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సారథ్యంలో సంజామల మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

- సద్వినియోగం చేసుకోవాలి : ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని కోర్టు ఆవరణంలో నేడు శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం రోజున కోర్టు ఆవరణంలో రెండు బెంచ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్, జూనియర్ సివిల్, రాజీ అయ్యే క్రిమినల్ తగాదాలను సీనియర్ సివిల్ కోర్టు భవనము నందు ఒక బెంచ్‌ను, జిల్లా కోర్టులకు సంబంధించిన కేసులలో జిల్లా కోర్టు భవనం నందు ఒక బెంచ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టులలో పెండింగ్లో ఉన్న సివిల్, రాజీ అయ్యే క్రిమినల్ కేసులు అన్నింటిని లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం పొంది అప్పీలు లేని తీర్పును పొందవచ్చన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూరు : గత ప్రభుత్వంలో తెచ్చిన జీవో 117ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కే దినేష్ కుమార్ నూతన టిడిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గుర్తింపు లేని స్కూల్లో పై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్లలో అధిక ఫీజులను అరికట్టాలని కోరుతూ శుక్రవారం డీఈవో సుధాకర్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు. నాడు-నేడు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. మూతపడిన ప్రభుత్వ స్కూళ్లను తిరిగి పునఃప్రారంభించా లని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, దిలీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకి వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రంలోనే ఆళ్లగడ్డను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాయబ్ రసూల్, కమిషనర్ రమేష్ బాబు తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం జరుపుకునేందుకు కౌన్సిల్ హాల్ సరిగా లేదని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులను మంజూరు చేయించి నూతన భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు, అధికారులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీలకతీతంగా ఆళ్లగడ్డను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం అన్ని శాఖల మంత్రులను అసెంబ్లీలో కలిసి నిధులను మంజూరు చేయిస్తామని తెలిపారు. ప్రజలు ఏదైనా పనుల కోసం వచ్చినప్పుడు అధికారులు ఇబ్బంది పెడితే సహించబోమని హెచ్చరించారు. తనకు ఓటు వేసి గెలిపించి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ..వారి కష్టసుఖాలలో ఎల్లప్పుడూ పాలుపంచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ భాష, బద్రి సుధాకర్ రెడ్డి, చింతకుంట రామ శేఖర్ రెడ్డి, సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి, జయరాం గౌడ్, రామాచారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఛైర్మన్, వైస్ ఛైర్మన్

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

వసుధ ఫౌండేషన్ సౌజన్యంతో రూ.10 వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె : వసుధ ఫౌండేషన్ సహకారంతో మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన తలారి బాలన్నకు పక్షపాతం రావడంతో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో తలారి లింగమ్మకు 10 వేల నగదును బండి కుమార్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్‌లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకూడదన్న సంకల్పంతో వసుధ ఫౌండేషన్ సౌజన్యంతో ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చెప్పారు. వసుధ ఫౌండేషన్ సేవలు ఎంతగానో పేద ప్రజలకు ఉపయోగపడుతున్నాయని, ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమైన విషయం అన్నారు. గతంలో వసుధ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందుల ద్వారా విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతోనే పుస్తకాలు తదితర సామాగ్రిని అందించామన్నారు. కరోనా సమయంలో ఇంటి పెద్దను కోల్పోయిన పేదవారికి నగదును పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నాగేంద్ర రెడ్డి, టీచర్ నాగరాజు, ఖాదర్, మల్లారెడ్డి, కోడి నాగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం జరుగనుంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి సారిగా కౌన్సిల్ సమావేశం జరుగుతుండటంతో కౌన్సిల్‌లో ఏమి జరుగుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు మెజార్టీగా వైసిపికి చెందిన వారే ఉన్నారు. నలుగురు టీడీపీకి చెందిన కౌన్సిలర్‌లు ఉన్నారు.. ఇటీవల ఎన్నికల ముందు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్ టీడీపీలో చేరడంతో కౌన్సిల్‌లో టీడీపీ సభ్యుల సంఖ్య ఐదుగురికి చేరింది. ఇప్పటి వరకు మున్సిపల్ కౌన్సిల్లో టీడీపీలోని భూమా గ్రూపనకు చెందిన మాబు వలి టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉంటూ వచ్చారు. ఎన్నికల్లో అంటి అంటనట్లు ఉండటం, మంత్రి ఫరూక్ వెంట ఉండకపోవడం వంటివి జరిగాయి. ఆయన స్థానంలో మున్సిపాలిటీపై బాగా పట్టు ఉన్న శ్యాం సుందర్ లాల్‌ను ఫ్లోర్ లీడర్‌గా చేస్తారా లేక మాబు వలినే కొనసాగిస్తారా అన్నది వేచి చూడాలి. ఫ్లోర్ లీడర్ ఎవరైనా కౌన్సిల్‌లో పట్టున్న వైసిపీ సభ్యులు ప్రజా సమస్యలపై సూత్రబద్ధంగా మాట్లాడుతారా? లేక వాగ్వివాదాలతో సమావేశం ముగిస్తారా? లేక ప్రశాంతంగా నడుస్తుందా అనేది వేచి చూడాలి. నేడు జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఏమి జరుగబోతుందనే ఉత్కంఠ పట్టణ ప్రజల్లో, రాజకీయ మేధావులలో నెలకొంది. డ్రెయినేజీ కాలువలు, సురక్షితమైన మంచినీరు ప్రజలకు అందించడానికి, పట్టణంలో అక్కడక్కడా లీకైన పైపులైన్‌ల మరమ్మత్తులు, మంత్రి ఫరూక్ ప్రకటించిన మరో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణంకు ప్రతిపాదనలు, తీర్మానంపై చర్చ జరిగేనా అని పట్టణ వాసులు ఎదురు చూస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న వెదురు, గుర్రం స్వాధీనం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం అటవీ రేంజ్ నల్లమల అడవుల నుంచి అక్రమంగా తరలిస్తున్న వెదురు, గుర్రంను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అప్పనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా నల్లమల అడవుల్లోకి ప్రవేశించి వెదురు నరికి వాటిని గుర్రంపై తీసుకొస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గుర్రం, వెదురును రుద్రవరం కలప డిపోకు తరలించామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచర్లలోని కర్నూల్ రహదారిలో గల అయ్యల చెరువులోని పాలిష్ ఫ్యాక్టరీలో బీహార్‌కు చెందిన వివాహిత నేహా (20) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రం, చాప్రాల్ జిల్లా, బాసర్ తాలూకా, పటేల్ బౌజ్ గ్రామానికి చెందిన గురువిన్ ఇక్కడ పాలిష్ ఫ్యాక్టరీలో పని చేస్తుండేవాడు. రెండు నెలల క్రితం సొంతూరికి వెళ్లి నేహాను వివాహం చేసుకొని గత మంగళవారం ఫ్యాక్టరీకి వచ్చాడు. గురువిన్ దంపతులు అన్యోన్యంగా ఉండేవారని స్థానికులు తెలిపారు. బేతంచర్లకు వచ్చిన నాలుగు రోజులకే నేహా ఆత్మహత్య చేసుకుంది. పోలీస్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : పొలంలో కొయ్యలు ఏరే పని చేస్తూ గుండెపోటుతో తలారి మునెమ్మ(53) మృతి సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. కొలిమిగండ్ల మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో తలారి అంకాలు భార్య మునెమ్మ(53) పొలంలో కొయ్యలు ఏరే పనికి వెళ్ళింది. పని చేస్తున్న చేస్తున్న ప్రదేశంలోనే మునెమ్మ గుండెపోటుతో కుప్పకూలిపోయింది. పొలం యజమానితోపాటు తోటి కూలీలు ఆమెని హాస్పిటల్ తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలంలోని చంద్రావతి కళ్యాణం మండపం పక్కన గల పార్కులో 2023 జూలై 3న డబ్బుల విషయంలో గొడవపడి అబ్రహాంను కొట్టి చంపిన కేసులో నిందితుడు మాడబాల కిషోర్ అలియాస్ ప్రేమానంద్‌ను అరెస్ట్ చేసినట్టు సిఐ ప్రసాదావు శుక్రవారం తెలిపారు. సిఐ మాట్లాడుతూ శ్రీశైలంలో వ్యక్తిని చంపిన ముద్దాయి షిర్డీ, కాశీ, యాగంటి, డోన్, కర్నూలు దగ్గర మద్దికెరలో తిరుగుతున్నాడని, చివరకు మద్దికెరలో అరెస్ట్ చేసి శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కేసు దర్యాప్తులో ఎస్సై లక్ష్మణరావు, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సుంకన్న, రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, అమర్నాథ్ రెడ్డిలు పాల్గొన్నారు.

జల వనరుల శాఖ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తనిఖీ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలోని జలవనరుల శాఖ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గిత్త జయసూర్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులతో కార్యాలయ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి టిజి భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : కర్నూలు నగరంలోని మౌర్యఇన్ హోటల్లో మంత్రి టీజీ భరత్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఖాతా రమేష్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పలుచాని మహేష్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మెరుగైన సేవలు అందించాలి

- ప్రత్యేకాధికారి డాక్టర్ మోహన్ రావు

ప్రజాశక్తి - సంజామల : పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలని ప్రత్యేకాధికారి, ఎడి డాక్టర్ మోహన్ రావు పేర్కొన్నారు. సంజామల ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని సంజామల, కొలిమిగుండ్ల మండలాల విఎఎస్‌లు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఏఐ, హెచ్ఎస్, ఇటి వ్యాక్సినేషన్‌పై ఆరా తీసి కీలక సూచనలు ఇచ్చారు. పశు వైద్యాధికారులు రమేష్ బాబు, రఘు బాలకృష్ణ, పద్మావతి, జెవిఓలు, ఏహెచ్ఏలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సంజామల : మండలంలోని మంగ పల్లి గ్రామంలో ఆదివారం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. బిపి, షుగర్, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీ వ్యాధులు, గర్భిణీ, ఎముకలు, కీళ్లు, కంటి జబ్బులు సంబంధించిన డాక్టర్లు, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధులకు సంబంధించిన డాక్టర్లు, దంతవ్యాధి డాక్టర్లు వస్తున్నట్లు తెలిపారు. రోగులు ఉచితంగా పరీక్షలు నిర్వహించుకుని ఉచితంగా మందులు తీసుకుని వెళ్లాలని తెలిపారు. అలాగే ఆధార్ కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు దస్తగిరెడ్డి తెలిపారు.

కార్మికులకు అదనపు బస్సు ఏర్పాటు చేయాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : సుండిపెంట గ్రామం నుండి ప్రతిరోజు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కార్తికేయ ఏజెన్సీ కింద పని చేస్తున్న కార్మికులకు అదనంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం దేవస్థానం అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం సున్నిపెంటలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆశీర్వాదం, మండల అధ్యక్షుడు వై.శ్రీను మాట్లాడారు. తూ శ్రీశైల పుణ్యక్షేత్రానికి సుండిపెంట నుండి షిఫ్ట్‌కు దాదాపు 70 మంది కార్మికులు ఒకే బస్సులో ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా ఉందన్నారు. కావును అదనపు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

పేదల సంక్షేమమే టిడిపి ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు : పేదల సంక్షేమమే టిడిపి ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డులో నీళ్లతొట్ల వీధిలో, గరీబ్ నగర్ కాలనీలో ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల టిడిపి, వైసిపి పాలనకు వత్యాసం చూశారని, సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని విశ్వసించి ఘన విజయం అందించారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటా, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి స్థలం, తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసే అధ్యాపకులను ఎప్పటికీ గుర్తించుకుంటారు : డివిఇఓ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే అధ్యాపకులను విద్యార్థులు, స్థానిక ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని డివిఇఓ సునీత అన్నారు. శుక్రవారం గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకులు హుస్సేన్ ఈ నెల 30న విరమణ పొందుతున్న సందర్భంగా కళాశాలలో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ సేవలను కొనియాడారు. అనంతరం హుస్సేన్ దంపతులను కళాశాల ప్రిన్సిపల్, సహచర అధ్యాపకులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, హైస్కూల్ ప్రిన్సిపల్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, సహచర అధ్యాపకులు పాల్గొన్నారు.

హుస్సేన్ దంపతులను సన్మానిస్తున్న డివిఇఓ సునీత, అధ్యాపకులు

కేశవరావు దంపతులను సన్మానిస్తున్న ఏసీ పుల్లయ్య, ఏపీఎం అనురాధ

సెర్ప్ అభివృద్ధికి కేశవరావు కృషి

ప్రజాశక్తి - పాములపాడు : ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య, ఏపీఎం అనురాధలు అన్నారు. శుక్రవారం ఐకెపి వెలుగు కార్యాలయంలో సిసిగా పని చేసిన కే కేశవరావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది కేశవరావు దంపతులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసి పుల్లయ్య, ఏపీఎం అనురాధలు హాజరై వారిని శాలువాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ కేశవరావు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారన్నారు. సెర్ప్ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని కోరారు. అనంతరం కేశవరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరికైనా ఇబ్బంది కలిగించి ఉంటే మనసులో పెట్టుకోకుండా క్షమించాలన్నారు. కార్యక్రమంలో సీసీ సౌభాగ్య, ఎంఎంఎస్ సభ్యులు, వివోఏలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలో శుక్రవారం జరిగిన వివాహ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఎం జాకీర్ హుస్సేన్, పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, నాయకులు ముర్తు జావలి, మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి : ఎడిఎ

ప్రజాశక్తి - చాగలమర్రి : రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి సూచించారు. చాగలమర్రి పట్టణంలోని మూడవ ఆర్‌బికేలో ఆయన సిబ్బందితో వివిధ వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎడిఎ మాట్లాడుతూ అవసరమైన ఎరువులు ఆర్‌బికెలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. పిఎం కిసాన్ లబ్ధిదారులలో 5 శాతం వెరిఫికేషన్ ఈ నెల 29లోపు పూర్తి చేయాలని, లేనిపక్షంలో వారు అనర్హులు అవుతారనే విషయం సంబంధిత రైతులకు తెలిపి వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. ఆర్‌బికె సిబ్బంది రైతులను సంప్రదించి భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించాలని తెలిపారు. సమావేశంలో ఏఓ రంగనేతాజి, ఆళ్లగడ్డ టెక్నికల్ ఎఓ నాగేంద్ర ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏడీఏ

కలిసి పని చేద్దాం.. మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దాం

- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -ఆత్మకూరు

కలిసి పని చేసి ఆత్మకూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ సమావేశం శుక్రవారం ఛైర్మన్ డాక్టర్ ఆసియా ఆధ్వర్యంలో స్థానిక అన్న క్యాంటీన్‌లో నిర్వహించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ప్రధానంగా పారిశుద్ధం, తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కో ఆప్షన్ సభ్యులు తిరుపతయ్య రాజీనామాను ఆమోదించాలని అజెండా పెట్టినప్పటికీ సభ్యులు వాయిదా వేశారు. వేసవికాలంలో మూడు ప్రైవేటు బోర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసామని వారికి బాడుగ చెల్లించాలని అధికారులు అజెండాలో ప్రవేశం పెట్టగా దానిని కూడా వాయిదా వేశారు. పట్టణంలో నీటి పన్ను పెంచాలని అధికారులు ప్రతిపాదించగా సభ్యులు తీవ్రస్థాయిలో స్పందించారు. పట్టణంలో అనధికారికంగా అనేక కొళాయిలు ఉన్నాయని, వాటిని క్రమబద్ధీకరించాలని, తరువాతనే నీటి పన్ను పెంపుపై చర్చిద్దామని కౌన్సిలర్లు అన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి శాఖల వారీగా ప్రణాళికలు తయారుచేసి తనకు అందించాలన్నారు. గత ఎమ్మెల్యే అనుచరులు మున్సిపాలిటీలో వేతనాలు తీసుకుంటూ ఎమ్మెల్యే ఇంటి వద్ద పనిచేసే సాంప్రదాయం ఉందని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీశైల దేవస్థానం పరిధిలో వేతనాలు పొందుతూ శిల్పా కార్తీక్ రెడ్డికి బాడీ గార్డుగా వ్యవహరించిన వారు ఉన్నారన్నారు. ప్రజల సొమ్మును సొంత సైన్యానికి వాడుకున్న చరిత్ర మాజీ ఎమ్మెల్యేదన్నారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రధానంగా డంపు యాడు సమస్య తక్షణమే పరిష్కరించాలన్నారు. మున్సిపాలిటీ శాశ్విత భవన నిర్మాణం సంబంధించిన విషయాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. తను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.120 కోట్లతో తెచ్చిన తాగునీటి పథకం ఇంకా పూర్తిగా కాకపోవడం శోచనీయమని అన్నారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ రాజగోపాల్, కో ఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, మారుబోతుల విజయ్, రంగస్వామి, సుల్తాన్, ప్రకాష్ రావు, పాణ్యం పార్వతి, సుగుణమ్మ, కమిషనర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పదు

- జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి

ప్రజాశక్తి - గడివేముల : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాలిక్ బాషా ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం సన్మాన కార్యక్రమం ఎంపీడీవో శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి మంజులవాని హాజరై మాట్లాడారు. ఈవోఆర్డి కాలిక్ బాషా సేవలను కొనియాడారు. అనంతరం కాలిక్ బాషాను జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, ఎంపీడీవో శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పూలమాలలతో సత్కరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు జెడ్పిటిసి ఆర్మీ చంద్రశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగమద్దమ్మ, తాసిల్దార్ జఫ్రుల్లా ఖాన్, రిటైర్డ్ ఎంపీడీవో అబ్దుల్ వహీద్, మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, టిడిపి మండల నాయకులు దేశం సత్యనారాయణరెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ తదితరులు పూలమాలలతో, శాలువాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు, మున్సిపాలిటీ యూనియన్ నాయకులు శుక్రవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ, మున్సిపాలిటీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బాల వెంకట్, ఆళ్లగడ్డ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాజ్యలక్ష్మి దేవి, మున్సిపాలిటీ యూనియన్ నాయకులుపాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను డిఇఓ ఆకస్మిక తనిఖీ

- పిఎం-3 పథకం కింద ల్యాబ్ ఏర్పాటుకు రూ.11లక్షలు మంజూరు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, గోకవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, లింగాపురం ఎంపీపీఎస్ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా లింగాపురంలో పాఠశాల నుండి 60 మంది విద్యార్థులు దగ్గర ఉన్న గోకవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లకుండా కొత్తపల్లి జెడ్పీహెచ్ హైస్కూల్‌కు వెలుతున్నారని తెలుసుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో డిఇఓ సమావేశమై అవగాహన కల్పించారు. దగ్గర ఉన్న పల్లెల్లోని విద్యార్థుల సౌకర్యార్థం గోకవరంలో జెడ్పీహెచ్ఎస్‌ను ఏర్పాటు చేశారని, అది వదిలి 4 కిమీ ఉన్న కొత్తపల్లికి పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కేజీబీవీలో నాడు-నేడు కింద నిర్మిస్తున్న రెండు అదనపు గదుల నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది డిఇఓ దృష్టికి తెచ్చారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపడతామని డిఇఓ చెప్పారు. కొత్తపలి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానమంత్రి-3 పథకం క్రింద ల్యాబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.11 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ల్యాబ్ నిర్మాణం కోసం స్థలసేకరణ చేయాలని హెచ్ఎం వెంకటేశ్వర్లుకు సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు ఎంఈఓ బాలాజీ నాయక్, గోకవరం పాఠశాల హెచ్ఎం రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు ఉచిత వైద్య శిబిరాలు

- బ్యానర్లను ఆవిష్కరించిన రెడ్ క్రాస్ సభ్యులు

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

మొబైల్ హెల్త్ వ్యాన్ ద్వారా జిల్లాలో ఉండే అడవి బిడ్డలకు (గిరిజనులకు) వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ ఛైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ ఛైర్మన్ మారుతి కుమార్ తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ వ్యాన్‌ను ఈ ఉచిత శిబిరాలకు వినియోగిస్తున్నాని వారు పేర్కొన్నారు. శుక్రవారం వైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను మొబైల్ హెల్త్ వ్యాను ముందు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శనివారం ఉదయము 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెచ్చేరువులో కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో వైద్య శిబిరం, 30వ తేదీ నుండి జూలై మూడో తేదీ వరకు శ్రీశైలం పరిసర ప్రాంతాలలో శ్రీశైలం సబ్ బ్రాంచ్ ఛైర్మన్ నాగ శేషు ఆధ్వర్యంలో వైద్య సేవలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, మండల వైస్ ఛైర్మన్ సోహెల్, డిఎఫ్ఓ రాజు నాయక్ పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి : కలెక్టర్

- ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీ

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని విశ్వనగర్ నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. అలాగే దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ప్రతి గ్రామంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డెంగ్యూ వ్యాధికి కారణమైన టైగర్ దోమలు మంచినీటి నిల్వ ఉన్నటువంటి ప్రదేశాలలో చేరి గుడ్లు పెట్టిన అనంతరం లార్వా పెద్ద దోమగా తయారై కుట్టడం జరుగుతున్న నేపథ్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, మెదడువాపు జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆశా వర్కర్లు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, వైద్య అధికారులు, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మలేరియా అధికారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని పార్లపల్లె గ్రామంలో సర్పంచి షేక్ షబ్బీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి వెంకట్ రాముడు, ఏఎన్ఎం రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి పిహెచ్సి వైద్యులు డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపురంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ యశోద, ఆరోగ్య కార్యకర్త పద్మావతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **చాగలమర్రి :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి శివచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని శెట్టివీడులో డెంగ్యూ కేసు నమోదు కావడంతో ఆయన గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్యంను పరిశీలించారు. పంచాయితీ కార్యదర్శి దస్తగిరి, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పి వాణి, ఏఎన్ఎం నిర్మల, ఆశ కార్యకర్త రేష్మా తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు. గాజులపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించారు. **ప్యాపిలి :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విద్యా బోధకుడు రాఘవేంద్ర గౌడ్ పేర్కొన్నారు. ప్యాపిలిలోని శివ సాయి పాఠశాలలో కరస్పాండెంట్ ఆలా సురేష్ సమక్షంలో అతిసారా, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులకు ఆరోగ్య నియమాలను తెలిపారు. **రుద్రవరం :** మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ తెలిపారు. మండలంలోని చిత్రేనిపల్లి సచివాలయ పరిధిలోని హరినగరం, ముకుందాపురం, చిత్రేనిపల్లి గ్రామాలలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు నరసింహయ్య, సవరం నాగ ముని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరూ విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల లార్వా నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని వైద్యాధికారులు జబీర్, హకీమ్ రషీద్‌లు సూచించారు. శుక్రవారం ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఎర్రమఠం, పాత మాడుగుల, ఎర్రమఠం చెంచుగూడెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు ఇంటింటికి వెళ్లి దోమ లార్వా నివారణ గురించి ప్రజలకు వివరించారు. హెల్త్ అసిస్టెంట్లు సత్యం రెడ్డి, శాంతమ్మ, సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కొత్తపల్లి : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు